**ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం**

**విశాఖపట్నం కేంద్రం**

**ప్రాంతీయ వార్తలు**

తేదీ: 24-05-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

**ముఖ్యాంశాలు**

- వికసిత్ భారత్ కళ సాకారంతో స్వర్ణాంధ్రను సాధించేలా ముందుకు వెళుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.
- ప్రతి ఒక్కరి జీవన విధానంలో యోగా ఒక భాగం కావాలని రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనిత అన్నారు.
- రాష్ట్రంలో ఈరోజు జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాలలో ఏడుగురు మరణించారు.
- ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 122వ సంచిక రేపు ఉదయం 11 గం.లకు ప్రసారమవుతుంది.
- నైఋుతి ఋుతుపవనాలు ఈరోజు కేరళను తాకాయని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.

===================

వికసిత్ భారత్ -2047 కళ సాకారంతో స్వర్ణాంధ్రను సాధించేలా ముందుకు వెళుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈరోజు న్యూఢిల్లీలో జరిగిన నీతి అయోగ్ పదవ పాలక మండలి సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ.. 2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నామని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ లో ఉన్న వనరులను తాము ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నామనేది ముఖ్యమంత్రి వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా విశాఖ నగరాన్ని తీర్చిదిద్దనున్నామని, విశాఖలో ప్రపంచ స్థాయి వాతావరణాన్ని కల్పించేందుకు నాలుగు జోన్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. విశాఖ నమూనాను అమరావతి, తిరుపతి, కర్నూలుకు విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. ప్రతీ కుటుంబానికి కుటుంబ ప్రయోజన డిజిటల్ పాస్‌బుక్ విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నామని స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా ప్రశంసించారు.

===================

ప్రతి ఒక్కరి జీవన విధానంలో యోగా ఒక భాగం కావాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈరోజు విశాఖ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఆర్ కె బీచ్ వద్ద యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఇంచార్జ్ మంత్రి డోలా శ్రీబాల వీరంజనేయస్వామితో కలిసి మంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. అనంతరం హోంమంత్రి అనిత పాత్రికేయులతో మాట్లాడుతూ... యోగా, శరీరానికి మాత్రమే కాకుండా మనస్సు కు కూడా ఆరోగ్యాన్ని ఇస్తుందన్నారు. ప్రజలు ప్రతిరోజూ కనీసం ఒక గంట యోగాకు సమయం కేటాయిస్తే, రోజంతా ఉత్సాహంగా గడిపేందుకు వీలుంటుందని తెలిపారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విశాఖలో నిర్వహించడం గర్వకారణమని మంత్రి అనిత పేర్కొంటూ...

(వాయిస్ బైట్...28 సెకన్లు)

===================

రాష్ట్రంలో ఈరోజు జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాలలో ఏడుగురు మరణించారు. కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. రాయచోటి నుంచి కడపకు కారులో వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గువ్వలచెరువు ఘాట్ రోడ్డు వద్దకు కారు రాగానే వెనుక వైపు నుంచి లారీ అతివేగంగా ఢీకొనడంతో కారులో ఉన్న నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంపై మంత్రులు అనిత, సవితా, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

===================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్ - మనసులోని మాట" కార్యక్రమం 122వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు అన్ని ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల ద్వారా ప్రసారం కానుంది.

===================

విశాఖపట్నంలో రేపు జరగనున్న యూపీఎస్సీ ప్రిలిమ్స్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఈరోజు పరిశీలించారు. ఏవీఎన్ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏర్పాటు చేస్తున్న కేంద్రాలతో పాటు, మరికొన్ని కేంద్రాలను సందర్శించి, అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, అభ్యర్థులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ క్రమంలో ఏవీఎన్ కళాశాలలో జరుగుతున్న పరీక్ష పరిశీలకుల శిక్షణ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ వారికి పలు సూచనలు చేశారు.

===================

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించే సన్నాహక కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు తమ సంపూర్ణ సహకారాన్ని అందించాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. ఈరోజు జిల్లా కేంద్రంలోని 80 అడుగుల రహదారిలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్ర కార్యక్రమాలు గ్రామ స్థాయి నుండి ఉద్యమంలా జరగాలన్నారు. ప్రతీ ఒక్కరూ యోగాంధ్రా వెబ్ సైట్ లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. యోగాపై విద్యా శాఖ ఆధ్వర్యంలో వక్తృత్వ, వ్యాసరచన, పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

===================

విరామం

===================

ప్రతి నియోజకవర్గంలో స్టేడియం ఏర్పాటు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు జిల్లా మునగాలపాడు ఆంధ్ర క్రికెట్ సంఘం మైదానాన్ని ఎంపీ కేశినేని శివనాథ్, కలెక్టర్ రంజిత్ భాషా తో కలసి మంత్రి ఈరోజు పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. మైదానం అభివృద్ధి ప్రణాళికను జూన్ 7 నాటికి సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి భరత్ పాత్రికేయులతో మాట్లాడుతూ... కర్నూలు నగరంలో క్రికెట్ స్టేడియం అభివృద్ధికి చర్యలు చేపట్టామని తెలిపారు. త్వరితగతిన మైదానం నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

===================

ప్రభుత్వ భూముల ఆక్రమణల స్వాధీనంపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. ఈరోజు సంయుక్త కలెక్టర్, ఉప కలెక్టర్, తహాశీల్దారులు, ఎంపిడిఓ లతో దృశ్య మాధ్యమ విధానంలో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం భూముల ఆక్రమణల గుర్తింపుకు జిల్లా మండల స్థాయి కమిటీ ఏర్పాటు చేయాలని, ఆక్రమణ దారులకు నోటీసులు జారీ చేయాలని చెప్పారు. బంజరు భూములు, ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణలను ఈనెల 31లోగా గుర్తించి నివేదిక సమర్పించాలన్నారు.

===================

గిరిజన ప్రాంత ప్రజలకు యోగాపై విస్తృత అవగాహన కల్పించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. ఈరోజు ప్రాజెక్టు కార్యాలయంలో యోగా శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయులతో ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కట్టా సింహాచలం మాట్లాడుతూ.. పంచాయతీ, మండల డివిజన్ స్థాయిలో కూడా జూన్ 21వ తేదీ వరకు యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏజెన్సీలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ అధికారులు, ఇతర శాఖల అధికారులు తమ తమ పరిధిలో యోగా కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు.
పిటిసి - అల్లూరి సీతారామరాజు జిల్లా

===================

ఉమ్మడి కర్నూలు జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 27న ఉద్యోగ మేళా జరుగనుందని ఉపాధి శాఖ జిల్లా అధికారి సోమశేఖరరెడ్డి ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నంద్యాల నేషనల్ ఐటీఐ కాలేజీ వద్ద ఫ్లిప్ కార్టు, యంగ్ ఇండియా సంస్థలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు ఈ ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చునని పేర్కొన్నారు.

===================

పల్నాడు జిల్లా నర్సరావు పేట కలెక్టర్ కార్యాలయలో ఈరోజు ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ కార్యాక్రమంలో సంయుక్త కలెక్టర్ సూరజ్ 32 వినతులను స్వీకరించారు. ఆయా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను సంయుక్త కలెక్టర్ ఆదేశించారు.

===================

చిన్న పిల్లలు అపరిచితులతో మాట్లాడవద్దని, వారి నుండి బహుమతులు, చాక్లెట్లు, బొమ్మలు స్వీకరించరాదని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జ్ హిమబిందు సూచించారు. ఈరోజు చిన్నారుల అదృశ్య దినోత్సవం సందర్భంగా జగ్గయ్యపేటలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో హిమబిందు పాల్గొని చిన్నారులకు పలు సూచనలు చేశారు. పిల్లలు బయటకు ఒంటరిగా వెళ్లకూడదని, అత్యవసర సమాచారాన్ని అందించేందుకు పిల్లలు తల్లిదండ్రుల పేర్లు, ఫోన్ నంబరు, ఇంటి చిరునామా గుర్తుపెట్టుకోవాలని సలహాఇచ్చారు.

===================

ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరంలోని ఒక భవనంలో ఈరోజు విద్యుత్ ఘాత ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. మృతులను రాజమండ్రికి చెందిన వారిగా గుర్తించారు. ముందుగా ఒకరు విద్యుత్ ఘాతానికి గురి కాగా, రక్షించబోయిన మిగిలిన ఇద్దరు కూడా విద్యుత్ ఘాతంతో ప్రాణాలు కోల్పోయారు.

===================

నైరుతి రుతుపవనాలు ఈ రోజు కేరళను తాకాయని, ఈ నెల 27వ తేదీ నాటికి ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనము ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలింది. ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపో ఆవరణములో దక్షిణ దిశగా గాలులు వీస్తున్నాయని, వీటి ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే రెండు రోజులూ తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరాణ శాఖాధికారి వెల్లడిస్తూ..

(వాయిస్ బైట్...30 సెకన్లు)

===================

===================